క్లుప్తంగా

నేటి నుంచి సమ్మర్ స్పోర్ట్స్ క్యాంపు

టేకుమట్ల: వెలిశాలలో నేటి(సోమవారం) నుంచి సమ్మర్ స్పోర్ట్స్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కొట్టె ప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శారీరక ధారుఢ్యం, మానసిక ఉల్లాసాన్ని పెంపొందించేందుకు వేసవి శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ వేసవి శిబిరంలో మండలంలోని అన్ని గ్రామాల 6 నుంచి 10వ తరగతి విద్యార్థులు సద్వినియోగం చేసుకోవచ్చునని తెలిపారు. ఈ నెల 26 వరకు కొనసాగే క్యాంపు ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు కొనసాగుతుందని పేర్కొన్నారు.

ప్రత్యేక పూజలు

కన్నాయిగూడెం: మండలంలోని బుట్టాయిగూడెంలోని లక్ష్మీదేవరను బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కాకుల మర్రిలక్ష్మణ్‌రావు నాయకపోడు కులస్తులతో కలిసి ఆదివారం సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. నాయకులు కావిరి చిన్నకృష్ణ, పూజరి కిషోర్, మటం వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచ్ దుర్గం నారాయణ, కార్యకర్తలు వెంకటయ్య, సుధాకర్, జనగం రవి, సాంబయ్య, కుమ్మరి నర్సింహారావు, దుర్గం రాజేష్, కావిరి అంజన్‌రావు ఉన్నారు.

దివ్యాంగుడి భూమి కబ్జా

ఏటూరునాగారం: మండల కేంద్రానికి దివ్యాంగుడి భూమిని కబ్జా చేసి అందులో ఓ వ్యక్తి అయిల్ పామ్ పంటను సాగు చేస్తున్నాడు. బాధిత దివ్యాంగుడు మహబూబ్‌అలీ 'సాక్షి'తో ఆదివారం వెల్లడించిన వివరాలు.. మండల పరిధిలోని మేడారం చెరువు శివారు ఎర్రగుంట చెరువు కింద 49/35/అలో ఒక ఎకరం మూడు గుంటలు, 49/38లో ఒక ఎకరం రెండుగుంటల భూమి ఉందని తెలిపారు. ఆ భూమిని కౌలుకు ఇచ్చుకొని వచ్చిన డబ్బుతో కుటుంబాన్ని పోషించుకునే వాడినని కానీ గత ఏడాది మండల కేంద్రానికి చెందిన కొంగరి శిరీష భర్త గోపాల్ కలిసి ఆ భూమిని కబ్జా చేశారని వాపోయారు. ఆ భూమిలో అయిల్ పామ్ సాగు చేస్తున్నారని ఆ భూమి తనదని కోర్టును ఆశ్రయించగా కోర్టు కూడా ఆ భూమి తనదనే తీర్పుచెప్పి ఆర్డీఓ, తహసీల్దార్‌కు లేఖలు రాసినట్లు తెలిపారు. కానీ వారు క్షేత్రస్థాయిలోకి వచ్చి విచారణ చేయకపోవడంతో న్యాయం జరగలేదని వాపోయారు. అధికారులు పట్టించుకోని తనకు న్యాయం చేయాలని లేకంటే మరణమే శరణ్యమని విలపించారు. స్థానికంగా ఉన్న రెవెన్యూ అధికారులు స్పందించి మహబూబ్‌అలీకి న్యాయం చేయాలని స్థానికులు కోరుతున్నారు.

మంటల్లో మొక్కలు..



దామెర : హరితహారంలో భాగంగా నాటిన మొక్కలను అధికారులు, గ్రామపంచాయతీ సిబ్బంది కాపాడి పెంచిపోషిస్తే దురదృష్టవశాత్తు అవి అగ్నికి ఆహుతయ్యాయి. ఈ సంఘటన దామెర మండల కేంద్రం పరిధిలో ఆదివారం చోటుచేసుకుంది. గ్రామ సమీపంలోని ప్రతిమ క్యాన్సర్ ఆస్పత్రి నుంచి దామెరకు వెళ్లేదారిలో అవెన్యూ ప్లాంటేషన్‌లో భాగంగా విరివిగా హరిహారం మొక్కలను నాటారు. అనంతరం అధికారుల పర్యవేక్షణలో గ్రామ పంచాయతీ సిబ్బంది చొరవతీసుకుని వాటిని సంరక్షించారు. దీంతో ఇప్పుడిప్పుడే రహదారికి ఇరువైపులా పచ్చదనం పెరుగుతుందని ప్రకృతి ప్రేమికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కాని కొంత మంది రైతులు వారి పంట వ్యర్థాలను కాల్చేక్రమంలో పదుల సంఖ్యలో చెట్లు కాలి బూడిదయ్యాయి. లక్షల రూపాయలు వెచ్చించి పెంచుతున్న చెట్లు, మొక్కలు కాలిపోవడంపై అటుగా వెళుతున్న వాహనదారులు, వనప్రేమికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఇలాంటి చర్యలు పునరావృతం కా కుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసున్నా రు.

కలుషితమవుతున్న తాగునీరు





మురికి నీటిలో ఉన్న నల్లాల వద్ద నీరు పట్టుకుంటున్న మహిళలు

- మురికి కూపాల్లో నల్లాలు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు

వెంకటాపురం(కె): మండల పరిధిలోని వీఆర్‌కే పురం పంచాయతీలోని చొక్కాల గ్రామంలో పంచాయతీ తాగు నీటి నల్లాలు మురికి కూపాల్లో ఉన్నాయి. దీంతో తాగు నీరు కలుషితమై ఇబ్బందులు పడుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చొక్కాల గ్రామంలో పాఠశాలకు వెళ్లే రహదారిలోని పంచాయతీ నల్లాల చుట్టూ బురద గుంటలు ఏర్పాడ్డయి. అలాగే నల్లాల వద్ద పైప్ లైన్ లీకై మురుగు నీరు నల్లాల చుట్టూ చేరుతోంది. గ్రామస్తులు నల్లా నీరు పట్టుకోవాలంటే బురద నీటిలో బిందెలు పెట్టుకొని పట్టుకోవాల్సి వస్తోంది. అధికారులు దృష్టి సారించి నల్లాల లీక్‌లను అరికట్టి బురద, మురికి నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. అలాగే గ్రామంలో పైప్ లై న్ లీకేజీ నీరు రోడ్డు పైకి చేరి బురదమయంగా మారుతోంది. రోడ్డుపై నడిచివెళ్లేందుకు ఇబ్బందులు పడాల్సి వస్తుందని ప్రజలు వాపోతున్నారు.

మరమ్మతు చేయాలి



గ్రామంలో నల్లాలు లీక్ అవుతుండడంతో బురదమయంగా మారుతుంది. అధికారులు స్పందించి మరమ్మతులు చేయించాలి. పంచాయతీ నల్లాలు చుట్టూ నీరు నిల్వకుండా శుభ్రంగా ఉండే విధంగా చూడాలి.

–రవిచంద్రమూర్తి, గ్రామస్తుడు, చొక్కాల

భానుడి భగభగ



నిర్మానుష్యంగా మారిన రోడ్డు

వెంకటాపురం(కె): మండలంలో భానుడు భగభగలతో తన ప్రతాపాన్ని చూపుతున్నాడు. ఆదివారం మండలంలో ఎండలు నిప్పుల కొలిమిని తలపించాయి. ప్రజలు ఎండ వేడిమికి తట్టుకోలేక తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మండలంలో 38 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదు అవుతుండటంతో ప్రజలు బయటకు వచ్చేందుకు భయందోళనలకు గురవుతున్నారు. ఉదయం ఆరు గంటల నుంచి 11 గంటల వరకు సాయంత్రం 5 గంటల తర్వతనే ప్రజలు బయటకు వస్తున్నారు. ఎండ వేడిమి తట్టుకోలేక ప్రజలు చెట్ల కింద సేద తీరుతున్నారు. దీంతో మండల కేంద్రంలో రోడ్లు అన్ని నిర్మానుష్యంగా మారాయి.

మహాసభల కరపత్రం ఆవిష్కరణ

మల్హర్: భారత మార్క్సిస్టు కమ్యూనిస్టు పార్టీ ఎంసీపీఐ రాష్ట్ర మహాసభలు విజయవంతం చేయాలని యూవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు, ఎంసీపీఐ రాష్ట్ర సభ్యుడు అక్కల బాపుయాదవ్ కోరారు. ఈ మేరకు మండలంలోని ఇప్పలపల్లిలో ఆదివారం తెలంగాణ రాష్ట్ర ప్రథమ మహాసభల కరపత్రం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బాపు మాట్లాడుతూ.. ఈనెల 20న నిర్వహించే సార్వత్రిక సమ్మెను, వరంగల్‌లో ఈనెల 26, 27, 28 నిర్వహించే భారత మార్క్సిస్టు కమ్యూనిస్ట్ పార్టీ ఎంసీపీఐ రాష్ట్ర ప్రథమ మహాసభలకు అందరూ సహకరించి విజయవంతం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎడ్ల రామయ్య, గొట్టం ఎల్లయ్య, బాపు, పోచయ్య, సత్య నారాయణ, రాజయ్య, రాజమణి తదితరులు పాల్గొన్నారు.



మహాసభ కరపత్రం ఆవిష్కరిస్తున్న బాపు

చెక్కుల పంపిణీ



చెక్కు పంపిణీ చేస్తున్న మాజీ జెడ్పీటీసీ సాగర్

చిట్యాల: మండలంలోని నైన్‌పాక గ్రామానికి చెందిన పలువురి లబ్ధిదారులకు మాజీ జెడ్పీటీసీ గొర్రె సాగర్ సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నైన్‌పాక గ్రామానికి చెందిన చెవుల రూప, గొర్రె గట్టక్క, దయ్యాల పద్మ, తోట్ల చంద్రయ్య ఇటీవల అనారోగ్య కారణాలతో చికిత్స చేయించుకుని సీఎంఆర్ఎఫ్ కోసం దరఖాస్తు చేయించుకున్నారు. ఈ మేరకు ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి సహకారంతో చెక్కులు మంజూరు కావడంతో పంపిణీ చేసినట్లు తెలిపారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

చదువుతోనే సమాజంలో గుర్తింపు

- ఎంఈఓ తిరుపతి

ములుగు రూరల్: చదువుతోనే సమాజంలో గుర్తింపు లభిస్తుందని మండల విద్యాశాఖ అధికారి వజ్జ తిరుపతి అన్నారు. ఆదివారం మండలంలోని రాయినిగూడెంలో ఏజెన్సీలో పదో తరగతిలో, ఇంటర్మీడియెట్‌లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను సీపీఎం ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఏజెన్సీ గ్రామాలైన అంకన్నగూడెం, జగ్గన్నగూడెం, సర్వాపూర్, పెగడపల్లి, కోత్తూరు, పంచోత్కులపల్లి గ్రామాల్లో విద్యార్థులను శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు గుండబోయిన రవిగౌడ్, వజ్జ రాజు, కొర్ర రాజు, గుండమీది వెంకటేశ్వర్లు, సాంబయ్య, ఐశ్వర్య, లక్ష్మీ, విజయ, పావని, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులను సన్మానిస్తున్న నాయకులు

లక్ష్మీనరసింహస్వామి కల్యాణానికి ఏర్పాట్లు



పాల పొరకతో వేసిన పందిరి



ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

వాజేడు: మండల పరిధిలోని బొగత జలపాతం వద్ద వెలసి ఉన్న లక్ష్మీనరసింహస్వామి ఆలయం వద్ద నేడు(సోమవారం) స్వామి వారి కల్యాణం నిర్వహించేందుకు ఆలయ పూజారి ఉయిక రాంబాయి ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. గుడి ప్రాంగణంలో పచ్చని పందిరి వేయడంతో పాటు భక్తులు కూర్చోవడానికి వీలుగా శుభ్రం చేశారు. స్వామి వారికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. కల్యాణం తిలకించడానికి భక్తులు ఎక్కువ సంఖ్యలో హాజరు కావాలని నిర్వాహకులు కోరారు.

పద్మశాలి సంఘం శాశ్వత సభ్యత్వ నమోదు



సభ్యత్వం అందజేస్తున్న నాయకులు

శాయంపేట : మండల కేంద్రంలోని చేనేత సహకార సంఘంలో కార్మికులకు అఖిల భారత పద్మశాలి సంఘం శాయంపేట గ్రామ ఉపాధ్యక్షుడు తుమ్మ ప్రభాకర్ ఆధ్వర్యంలో పద్మశాలి సంఘం శాశ్వత సభత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ.. భవిష్యత్‌లో పద్మశాలీలందరూ సంఘం బలోపేతానికి కృషిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చంద్రమౌళి, చేనేత సహకార సంఘం డైరెక్టర్ లక్ష్మీనారాయణ, గోపి పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

ములుగు రూరల్: మండలంలోని కొత్తూరు గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు వీరమనేని రవీందర్‌రావు తండ్రి వీరమనేని సోమేశ్వర్‌రావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబాన్ని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క ఆదివారం పరామర్శించారు. అనంతరం మల్లంపల్లి మండలం పందికుంట గ్రామానికి చెందిన గుండ యాదగిరి తండ్రి మృతి చెందగా ఆయన కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. మంత్రి వెంట జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్, గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ బానోత్ రవిచందర్, కాంగ్రెస్ నాయకులతో పాటు తదితరులు ఉన్నారు.



కొత్తూరులో పరామర్శిస్తున్న మంత్రి సీతక్క

వైభవంగా మత్స్యగిరి స్వామి కల్యాణం



శాయంపేట : స్వామి కల్యాణం జరిపిస్తున్న అర్చకులు



ఆత్మకూరు : కల్యాణం జరిపిస్తున్న పండితులు

శాయంపేట : మండల కేంద్రంలోని అతి పురాతనమైన శ్రీమత్స్యగిరి స్వామి దేవాలయంలో తిరుకల్యాణ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం శ్రీ మత్స్యగిరి స్వామి, శ్రీదేవి-భూదేవి కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయ చైర్మన్ సామల భిక్షపతి దంపతులు తమ ఇంటి వద్ద నుంచి స్వామి వారికి పట్టు వస్త్రాలను, తలంబ్రాలను మంగళ వాయిద్యాల నడుమ తీసుకువచ్చి స్వామి వారికి సమర్పించారు. వేదమంత్రోచ్చరణ నడుమ ఆలయ ప్రధాన అర్చకులు ఆరుట్ల కృష్ణమాచార్యులు, యాగ్నీకులు వీరవెల్లి వేణుగోపాలచార్యులు స్వామివారి కల్యాణాన్ని వైభవంగా జరిపించారు. గట్ల జయపాల్‌రెడ్డి-సరోజన దంపతులు కల్యాణ దాతగా వ్యవహరించారు. అనంతరం ఆలయ చైర్మన్ సామల భిక్షపతి-రాజమణి దంపతులు మహా అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు జిన్నా ప్రతాప్‌సేనారెడ్డి, గట్ల భగవాన్ రెడ్డి, జిన్నా కృపాకర్‌రెడ్డి, శివరామకృష్ణరెడ్డి, మనీశ్‌రెడ్డి, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కందగట్ల కోటేశ్వరరావు, చిందం రవి, బాసాని మార్కండేయ, వినుకొండ శంకరాచారి, వనం దేవరాజు, మార్త సుమన్, దిండిగాల వంశీ, బాసాని బాలకృష్ణ, గిద్దమారి సురేశ్, డి.సుమన్, రామ్‌గోపాల్ పాల్గొన్నారు.

ఆత్మకూరులో..

ఆత్మకూరు : మండల కేంద్రంలోని శ్రీవేణుగోపాల స్వామి ఆలయంలో ఆదివారం బ్రహ్మోత్సవాలు వైభవంగా జరిగాయి. ఆదివారం హోమం, చక్రస్నానం, నాగవల్లి కార్యక్రమాలు అర్చకులు ఆరుట్ల మాధవమూర్తి అధ్వర్యంలో వైద పండితులు వేద మంత్రోచ్చరణల నడుమ జరిగాయి. శనివారం అర్థరాత్రి వరకు రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి కల్యాణ మహోత్సవం కనులపండువగా జరిగింది. సోమవారం జాతర ఉంటుందని, భక్తులు అధిక సంఖ్యలో తరలిరావాలని అర్చకులు ఆరుట్ల మాధవమూర్తి కోరారు.

జామాయిల్ తోట, పశుగ్రాసం దగ్ధం

మొగుళ్లపల్లి: మండలంలోని పెద్దకోమటిపల్లిలో ఆదివారం అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. పెద్దకోమటిపల్లి గ్రామంలో అగ్ని ప్రమాదంలో చోటు చేసుకోవడంతో మంద తిరుపతిరెడ్డి జామాయిల్ తోట, మంద సంజీవరెడ్డికి చెందిన వరి పంట పశు గ్రాసం దగ్ధం అయ్యాయి. అగ్నిమాపక వాహనానికి సమాచారం అందిచగా సంఘటన స్థలానికి చేరుకొని మంటలు ఆర్పారు. సుమారు రూ.3 లక్షల ఆస్తి నష్టం వాటిల్లినట్లు తెలిపారు.

ఒకరికి గాయాలు

కాటారం: మండలంలోని కొత్తపల్లి-ములుగుపల్లి రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ద్విచక్ర వాహనదారుడి గాయాలపాలయ్యాడు. వివరాల్లోకి వెళ్తే.. కారులో మంచిర్యాలకు చెందిన వారు ములుగుపల్లి వైపుగా వెళ్తున్నారు. ఈ క్రమంలో పంబాపూర్‌కు చెందిన సురేశ్ తన ద్విచక్ర వాహనంపై వెళ్తూ ఆకస్మాత్తుగా ఆగిన కారును వెనక నుండి ఢీ కొట్టారు. దీంతో సురేశ్‌కు పలుచోట్ల గాయాలవగా స్థానికులు చికిత్స నిమిత్తం భూపాలపల్లి ఆస్పత్రికి తరలించారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే సత్యనారాయణరావు

భూపాలపల్లి రూరల్: పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే సత్యనారాయణరావు అన్నారు. గణపురం మండలం లక్ష్మారెడ్డిపల్లి గ్రామానికి చెందిన కొత్త రాంరెడ్డి గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతూ హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. దీంతో ఆ గ్రామ మాజీ సర్పంచ్ ఒద్దుల విజయఅశోక్ రెడ్డి బాధితుడి గురించి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావుకు తెలుపగా వెంటనే స్పందించి రూ.1,70,000 విలువైన ఎల్‌ఓసీని మంజూరు చేయించారు. ఈమేరకు ఎల్‌ఓసీని పత్రాన్ని ఆదివారం జిల్లా కేంద్రంలోని మంజూరునగర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రైవేట్, కార్పొరేట్ ఆస్పత్రుల్లో వైద్యం చేయించుకోలేని పేద, నిరుపేదవారికి ఎల్‌ఓసీ అండగా నిలుస్తుందన్నారు.



ఎల్‌ఓసీ అందిస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణరావు

దుప్పి మాంసం పట్టివేత

కాటారం: వేటగాళ్లు దుప్పి మాంసం అక్రమంగా తరలిస్తుండగా మహాముత్తారం మండలం కోనంపేట వద్ద పోలీసులు ఆదివారం పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మహాముత్తారం మండలం నిమ్మగూడెంకు చెందిన సాయిరాం, ఉదయ్‌కిరణ్, రాజశేఖర్ యత్నారం గ్రామంలోని అటవీ ప్రాంతంలో విద్యుత్ తీగలు అమర్చి దుప్పిని వేటాడి కొంత మాంసంను భూపాలపల్లి మండలం నాగారంలో విక్రయించారు. మిగితా మాంసంను మహాముత్తారం వైపుగా ద్విచక్ర వాహనంపై తీసుకొస్తున్నారు. ఈ క్రమంలో కోనంపేట వద్ద వాహన తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు అనుమానం వచ్చి పరిశీలించగా వారికి దుప్పి మాంసం లభించింది. ఈ మేరకు పెగడపల్లి రేంజ్ అటవీ శాఖ అధికారులకు నిందితులు, దుప్పి మాంసం అప్పగించినట్లు పోలీసులు తెలిపారు. ఈ విషయమై పెగడపల్లి రేంజ్ అధికారి వెంకటేశ్వర్‌రావును వివరణ కోరగా పోలీసులు పట్టుకున్న మాంసం అందజేశారని పూర్తి స్థాయిలో విచారణ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.



నిందితులను చూపిస్తున్న పోలీసులు

అటవీ శాఖలో సిబ్బంది కొరత

- అదనపు బాధ్యతలతో కాలం వెల్లదీత
- అటవీ సంపదకు రక్షణ కరువు

మల్హర్: అటవీ శాఖలో సిబ్బంది కొరత వేదిస్తోంది. కింది స్థాయి ఉద్యోగుల నుంచి ఉన్నతాధికారుల వరకు కీలక పోస్టులన్నీ ఖాళీగా ఉన్నాయి. దీంతో అటవీ సంపదకు రక్షణ కరువైంది. అక్రమార్కుల గొడ్డలి వేటుకు విలువైన అటవీ సంపద తరిగి పో తోంది. ఇదే అదునుగా వేటగాళ్లు వన్యప్రాణులను హతమారుస్తున్నారు. కొందరు విద్యుత్ వైర్లు, ఉచ్చుల సహాయంతో అటవీ జంతువులను వేటాడి మాంసాన్ని విక్రయిస్తున్నారు. విధులు నిర్వహించే అధికారులు, సిబ్బందిపై అదనపు భారం పడుతోంది.

మండలంలో అటవీ విస్తీర్ణం

మండలంలో కొయ్యూరు రేంజ్ పరిధిలోని (15 గ్రామ పంచాయతీల్లో) తాడిచర్ల, మల్లారం, కొయ్యూరు, రుద్రారం సెక్షన్లు ఉన్నాయి. వీటి పరిధిలో 26368.11 ఎకరాల అడవి విస్తరించి ఉంది. ఇక్కడ పని చేసే అధికారులు అడవులను, వన్య ప్రాణులను రక్షిస్తూ పచ్చదనం పెంపొందించేందుకు కృషి చేస్తారు.

అటవీ సంరక్షణకు ఇబ్బందులు

మండలం మొత్తం కొయ్యూరు ఫారెస్టు రేంజ్ అధికారి, నలుగురు సెక్షన్ అధికారులు, 15 మంది బీట్ అధికారులు పని చేయాల్సి ఉంది. ప్రస్తుతం ముగ్గురు సెక్షన్ అధికారులు, ఐదుగురు బీట్ అధికారులు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. ఈ ఐదుగురిలో ఇద్దరు ట్రైనింగ్‌కి వెళ్లినట్లు అధికారులు తెలుపుతున్నారు. ఉన్న అరకొర సిబ్బందితో అధికారులు అదనపు బాధ్యతలు అప్పగించి కాలం వెల్లదీస్తున్నారు. సిబ్బంది కొరతతో అటవీ భూములను పరిరక్షించడం అధికారులకు కత్తిమీద సాములా మారింది. అడవులపై పర్యవేక్షణ కొరవడుతుందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మండలంలోని పలు ప్రాంతాల్లో కొందరు అటవీ భూములను ఆక్రమించడం వంటివి చోటు చేసుకుంటున్నాయి. అటవీ శాఖ అధికారులు సర్వే చేపడుతున్న సమయంలో అటవీ భూమి అన్యాక్రాంతానికి గురవుతుండడంతో తరుచూ రైతులకు, అటవీ శాఖ అధికారుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుని ఘర్షణలకు దారి తీస్తోంది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి అటవీ శాఖలోని పోస్టులను భర్తీ చేసి అడవులను, వన్యప్రాణులను కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.



కొయ్యూరు ఫారెస్ట్ రేంజ్ కార్యాలయం

సమస్యలు ఎదురవుతున్నాయి..



కొయ్యూరు రేంజ్ పరిధిలో తగిన సిబ్బంది లేక సమస్యలు ఎదువుతున్నాయి. 15 మంది బీట్ అఫీసర్లకు గాను 5గురు మాత్రమే పని చేస్తున్నారు. అత్యవసర సమయంలో ఫారెస్ట్‌లోకి వెళ్లాడానికి ఇబ్బందులు పడాల్సి వస్తుంది. ఖాళీ ఉన్న పోస్టులను ప్రభుత్వం భర్తీ చేయాలి

– లక్ష్మణ్, తాడిచర్ల సెక్షన్ అధికారి, కొయ్యూరు రేంజ్

స్థానిక ఎన్నికల్లో యువతకు ప్రాధాన్యం

నర్సంపేట : రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో యువతకు ప్రాధాన్యం కల్పిస్తామని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ గోగుల రాణాప్రతాప్‌రెడ్డి అన్నారు. చెన్నారావుపేట బీజేపీ మండల అధ్యక్షుడు దామెరుప్పుల శేఖర్ ఆధ్వర్యంలో ఆదివారం జీడిగడ్డ తండాకు చెందిన బీజేపీ నాయకులు భూక్య హరీష్ అధ్యక్షతన కాంగ్రెస్‌కు చెందిన కార్యకర్తలు భూక్య వినోద్, మురళి, రాజేష్, నవీన్, భూక్య గణేష్‌లతో పాటు మరికొంత మంది బీజేపీలో చేరారు. బీజేపీలో చేరిన వారికి రాణాప్రతాప్‌రెడ్డి బీజేపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

ముదిరాజ్ యువకులు చైతన్యవంతులవ్వాలి

నర్సంపేట : ముదిరాజ్ యువకులు చైతన్యవంతులవ్వాలని మెపా వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు పులి దేవేందర్ ముదిరాజ్ అన్నారు. చెన్నారావుపేట మండలంలోని లింగగిరిలో ఆదివారం ముదిరాజ్ యువకులతో ముఖాముఖి కార్యక్రమం జిల్లా ప్రధాన కార్యదర్శి పెండ్యాల కృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా దేవేందర్ మాట్లాడుతూ రానున్న కాలంలో రిజర్వేషన్ సాధించాలన్న, విద్యా అవకాశాలు పొందాలన్న యువతతోనే సాధ్యమన్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు పొన్నం రాజు మాట్లాడుతూ ముదిరాజ్‌లకు విద్య, ఉద్యోగ అవకాశాల కోసం మెపా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి పెండ్యాల కృష్ణ మాట్లాడుతూ జిల్లాలో లింగగిరి గ్రామం యువత అందరికి ఆదర్శంగా ఐకమత్యంతో ముందకెళ్తుందన్నారు. వీరిని అందరూ ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు తాడేం రామచంద్రు, సాదబోయిన అశోక్, రంజిత్, కొత్తగూడెం మండల మెపా అధ్యక్షుడు అల్లాడి రాజు, శ్రీనివాస్, సందీప్, అనిల్, జయప్రకాశ్ ఉన్నారు.